క్లుప్తంగా

జెడ్పీ చైర్మన్‌కు, వైస్ చైర్మన్ అభినందనలు


జెడ్పీ చైర్మన్ వెంకాయమ్మకు శుభాకాంక్షలు తెలుపుతున్న సుజ్ఞానమ్మ

మార్టూరు: ఉమ్మడి ప్రకాశం జిల్లా జెడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మకు, వైస్ చైర్మన్ చుండి సుజ్ఞానమ్మ సోమవారం అభినందనలు తెలిపారు. జిల్లాపరిషత్ కార్యవర్గం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఒంగోలులో జెడ్పీ కార్యాలయంలో వెంకాయమ్మకు పుష్పగుచ్ఛం అందజేసి సుజ్ఞానమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

జే.పంగులూరు: మండల కేంద్రం పంగులూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఇన్ఫర్‌మేషన్ టెక్నాలజీపై జరిగిన క్విజ్ పోటీలో మండలంలోని బూదవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన భవనం శివాని మొదటి బహుమతిని సాధించింది. రెండో బహుమతిని పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని రాయిని సాంబశివ మహేష్, మూడో బహుమతి చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కట్టా వంశీ కృష్ణ సాధించారు. ఈపోటీలకు మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులు హాజరవుతారని ఎంఈఓలు నాగభూషణం, వీరాంజనేయులు తెలిపారు.

రక్తదానంతో ప్రాణదాతలు


దాతలకు జ్యూస్ అందజేస్తున్న కృష్ణారెడ్డి

అద్దంకి రూరల్: రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేయటమేనని రెడ్‌క్రాస్ బాపట్ల జిల్లా ఎంసీ మెంబర్ బీవీ కృష్ణారెడ్డి అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో రెడ్‌క్రాస్ రక్తదాన శిబిరం నిర్వహించారు. యువకులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో చిన్నారులకు స్వస్థత


ఫిజియోథెరపీ చేస్తున్న ప్రియదర్శిని

అద్దంకి రూరల్: ఫిజియోథెరపీతో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు స్వస్థత చేకూర్చవచ్చని ఫిజియోథెరపిస్టు ఇందిరా ప్రియదర్శిని అన్నారు. సోమవారం అద్దంకి భవిత కేంద్రంలో ఫిజియోథరపీ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరా ప్రియదర్శిని మాట్లాడుతూ ప్రతి సోమవారం కేంద్రంలో జరిగే క్యాంపులకు చిన్నారులను, తల్లిదండ్రులు తప్పక తీసుకురావాలన్నారు. క్రమం తప్పకుండా వ్యాయాయం చేయించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, దక్షిణాయనం నిజ శ్రావణ మాసం, శ్రవణం నక్షత్రం ద్వాదశి తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

మానవ హక్కుల పరిరక్షణకు కృషి

చీమకుర్తి: పారా అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు ఆ సంస్థ నిర్వాహకులు అనూరాధ, భగత్‌సింగ్ తెలిపారు. సంతనూతలపాడు జిల్లా పరిషత్ హైస్కూలులోని విద్యార్థులు, టీచర్లతో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలడిగి తెలుసుకున్నారు. సంతనూతలపాడు, చీమకుర్తి, మద్దిపాడు, కొత్తపట్నం, ఒంగోలు మండలాల పరిధిలోని 40 హైస్కూళ్ల విద్యార్థులతో మానవ హక్కుల సంఘం ఏర్పాటు చేసి వారి సమస్యల పరిష్కారానికి సంస్థ పనిచేస్తోందని వారు తెలిపారు.

ఇంటింటికీ వైద్యం..

అందరికీ ఆరోగ్యం


కొణిదెనలో మంచంలో ఉన్న వృద్ధుడిని పరీక్షిస్తున్న వైద్యాధికారి


సోమవరప్పాడులో వృద్ధురాలిని పరీక్షిస్తున్న వైద్యాధికారి

- ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్‌తో ఇంటింటా వైద్యం
- ఆరునెలల్లో 392 మంది రోగులకు అత్యవసర చికిత్స
- వృద్ధులు, చిన్నారులు, బాలింతలకు గ్రామాల్లోనే ఉచిత వైద్య సేవలు

బల్లికురవ: ఈ నాలున్నరేళ్లలో విద్య, వైద్యంలో పెను విప్లవం తీసుకొచ్చింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. ప్రజలకు ముందు కనీస అవసరాలు విద్య, వైద్యం, ఆరోగ్యంతోనే మెరుగైన సమాజం ఏర్పడుతుందని బలంగా నమ్మిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి. కార్పొరేట్ వైద్యాన్ని గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలకు ఇంటింటా ఉచిత వైద్య సేవలు అందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టారు. మండలంలో గ్రామాల వారీగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటుతో వైద్య పరీక్షలు మందులు పంపిణీతో సేవలందిస్తున్నారు. ఈసేవలకు తోడు పీహెచ్‌సీ వైద్యులు, 104 వైద్యులచే నెలకు రెండు పర్యాయాలు షెడ్యూల్ ప్రకారం శిబిరాల ఏర్పాటుతో షుగర్, బీపీ, హెచ్‌బీ 11 రకాల పరీక్షలతో మందులు పంపిణీ చేస్తున్నారు.

392 మంది రోగులకు అత్యవసర చికిత్సలు..

ఈ ఏడాది ఏప్రిల్ 7 నుంచి ఎఫ్‌డీసీ పోగ్రామ్‌ను ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు. వైద్యులు రమీజ్ అహమ్మద్, భారతి, మమత తోపాటు ఆ గ్రామ ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం ఆశా వర్కర్లు, గుంటుపల్లి పీహెచ్‌సీ పరిధిలోని 20 సచివాలయాల్లో 392 మంది వృద్ధుల ఇంటికి వెళ్లి చికిత్స అందించి ప్రాణాపాయం నుంచి తప్పించారు. బాలింతలు చిన్నారులతోపాటు ఆరోగ్యశ్రీలో పట్టణాలకు వెళ్లి చికిత్సలు పొంది గ్రామాలకు వచ్చిన రోగులను పరీక్షిస్తున్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో 5 ఏళ్లలోపు చిన్నారులు స్కూల్ హెల్త్ పోగ్రామ్‌లో భాగంగా పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు రక్తహీనత లేకుండా పరీక్షలతో మందులు పంపిణీ చేస్తున్నారు. అంతేకాకుండా పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నారు.

ఇంటికే వచ్చి పరీక్షలు చేస్తున్నారు..



ఇంటి వద్దకే వచ్చి 104 ద్వారా పరీక్షలు కూడా చేస్తున్నారు. అనంతరం మందులు కూడా ఉచితంగా అందజేస్తున్నారు. తనలాంటి వృద్ధులు శిబిరానికి వెళ్లే పరిస్థితి లేనందున డాక్టర్, సిబ్బంది ఇంటికే వచ్చి పరీక్షలతో మందులు అందజేస్తున్నారు. గతంలో అనారోగ్యానికి గురైతే 20 కిలో మీటర్ల దూరంలోని చిలకలూరిపేటలోని ప్రైవేట్ వైద్యశాలకు వెళ్లి గంటల తరబడి నిరీక్షించేదాన్ని. నేడు ఆపరిస్థితి లేకుండా ఇంటికే ప్రభుత్వ డాక్టర్ వచ్చి పరీక్షిస్తున్నారు.

– టీ వెంకాయమ్మ, కొణిదెన

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం..



వైద్య వసతిలేని మా గ్రామానికి వైఎస్సార్ హెల్త్ క్లినిక్, 104 ద్వారా శిబిరాలు, డాక్టర్ ఇంటికి వచ్చి పరీక్షించడం చాలా ఆనందంగా ఉంది. వైద్యాన్ని తమలాంటి పేదలకు అందుబాటులోకి తెచ్చి వైద్యసేవలు అందిస్తున్న జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం. ఇలాంటి పనులు మరెన్నో చేయాలని కోరుకుంటున్నాం.

– వెంకటరామయ్య, సోమవరప్పాడు

వైద్యసేవలు వినియోగించుకోండి..



గుంటుపల్లి పీహెచ్‌సీలో డాక్టర్లు, సిబ్బంది, మందులకు కొరత లేదు. వైద్యానికి పట్టణాలకు వెళ్లి డబ్బు ఖర్చు చేసుకోవద్దు. ఇక్కడే అన్ని రకాల పరీక్షలతో వైద్యం అందిస్తున్నాం. వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌ల్లోను 104 శిబిరాలు ఇంటింటా వృద్ధులు. చిన్నారులు, బాలింతలకు పరీక్షలతో మందులు పంపిణీ చేస్తున్నాం.

– రమీజ్ అహమ్మద్, వైద్యాధికారి

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు మేలు


ఈపురుపాలెంలో మాట్లాడుతున్న జేసీఎస్ కన్వీనర్


కొప్పరపాలెం పాఠశాలలో జేఏఎస్ సంబంధించి వసతులు పరిశీలిస్తున్న ఎంపీడీవో


స్వర్ణలో ఇంటింటి సర్వేలో పాల్గొన్న వైద్య సిబ్బంది

బల్లికురవ: ప్రభుత్వం దార్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు కార్పొరేట్ వైద్యంతో స్వస్థత చేకూర్చేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను ఏర్పాటు చేసిందని.. గ్రామాల వారీగా విజయవంతం చేయాలని ఎంపీడీవో సీహెచ్ కృష్ణ కోరారు. సోమవారం కొప్పరపాలెం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం జరిగే జే ఏ ఎస్ క్యాంపుకు సంబంధించి వసతులు పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు తరగతుల నిర్వహణకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టాలని సెక్రటరీ కోటేశ్వరరావు, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశా వర్కర్ వలంటీరు రోగులను గ్రామాల వారీగా గుర్తించారని చెప్పారు. వీరందరికీ కార్పొరేట్ వైద్యులు పరీక్షలతో అవసరమైన వారికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పట్టణాలకు తీసుకువెళ్లి శస్త్ర చికిత్స చేస్తారని ఎంపీడీవో వివరించారు.

చీరాల టౌన్: 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం ద్వారా పేద ప్రజలకు ఉపయోగపడతుందని.. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సచివాలయాల మండల కన్వీనర్ బుర్ల సాంబశివరావు సూచించారు. సోమవారం మండలంలోని ఈపురుపాలెం సచివాలయం–3లో జగనన్న ఆరోగ్య సురక్ష పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మండల కన్వీనర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకోవడంతో పాటుగా అందరిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. మండలంలో ఈనెల 30 నుంచి ప్రారంభం చేస్తున్నామన్నారు. సమావేశంలో పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వరరావు, మాజీ కోఆప్షన్ సభ్యులు మస్తాన్, సచివాలయం కార్యదర్శి ప్రేమ్, కన్వీనర్లు మహ్మద్‌బాబు, డి.నరేష్, డి.లీలా కృష్ణ, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నెలాఖరు నుంచి జగనన్న సురక్ష..

స్వర్ణ(కారంచేడు): రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యం కోసం నూతనంగా ఈనెలాఖరు నుంచి ప్రారంభించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వార గ్రామాల్లోని పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని స్వర్ణ పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ షాలినీ, డాక్టర్ హస్మప్రియలు అన్నారు.

సోమవారం మండలంలోని స్వర్ణ పీహెచ్‌సీ పరిధిలోని స్వర్ణ–2 గ్రామ సచివాలయం, కొడవలి వారిపాలెం గ్రామాల్లో నిర్వహించిన ఇంటింటి సర్వేను వారు పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఈ మీనాకుమారి, హెచ్‌వీ మాధురీసిఫోరా, ఎంపీహెచ్ఈఓ వీ వెంకటేశ్వరరావు, సీహెచ్‌ఓలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిభా పోటీలతో విద్యార్థుల్లో నైపుణ్యం


పోటీలను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ సుబ్బయ్య

వేటపాలెం: విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించి వారిలో ప్రతిభను వెలికి తీయాలని ఎంఈఓ సుబ్బయ్య సూచించారు. స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోగల జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల్లో టీసీఎస్ ఇన్ఫర్‌మేషన్ టెక్నాలజీపై ప్రతిభా పోటీలు సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాల్లోని 8,9,10 తరగతుల విద్యార్థులకు మండల స్థాయిలో ప్రతిభా పోటీలు నిర్వహించాలని ఆదేశించారన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండలం పరిదిలోని వివిధ హైస్కూల్స్ విద్యార్థులకు క్విజ్, పోటీలు నిర్వహించారని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు ఈ నెల 26న జిల్లాస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనన్నుట్టు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం పి దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు ఎం జానమ్మ, రత్నం, క్రిష్ణ, సహదేవి కుమార్, పార్వతి, సరళాదేవి పాల్గొన్నారు.

అలరించిన సరిగమ స్వరాలు

చీరాల రూరల్: డాక్టర్ ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం వర్ధంతి పురస్కరించుకుని ఆర్ యహోషువా సరిగమ స్వరాలు గ్రూప్ ఆధ్వర్యంలో బాలు స్వర రాగాలు మ్యూజికల్ నైట్ కార్యక్రమాన్ని సోమవారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గాయని, గాయకులతో పాటు విజయవాడ, విశాఖపట్టణం, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ గాయని, గాయకులు పాల్గొని మధురమైన గీతాలను ఆలపించారు. గాయని, గాయకులు భక్తి గీతాలతో పాటు సినిమా పాటలను ఒకరిని మించి మరొకరు ఆలపించి శ్రోతలను మెప్పించారు. కార్యక్రమాన్ని యహోషువ, బి. దాస్, కుమార్‌లు పర్యవేక్షించారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

చీరాల అర్బన్: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆవిర్భావం జరిగి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా స్వర్ణోత్సవ సంబరాల పోస్టర్‌ను సోమవారం చీరాల ప్రాంతీయ నూతన కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలను అందరూ విజయవంతం చేయాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా సహాధ్యక్షుడు బండి భిక్షాలుబాబు, జిల్లా కార్యదర్శి షేక్ జానీబాషా, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

బల్లికురవ: విజయవాడలో అక్టోబర్ 1 న జరిగే యూటిఎఫ్ స్వర్ణోత్సవాలకు ఉపాధ్యాయులంతా తరలివచ్చి విజయవంతం చేయాలని మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డీ. శేషగిరి, సీహెచ్ శ్రీనివాసరెడ్డి, చంటి పిలుపు నిచ్చారు. సోమవారం బల్లికురవలో యూటీఎఫ్ స్వర్ణత్సవాలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. రామాంజనేయులు, సీహెచ్ అచ్యుత మోహన్, వీరాజంనేయులు తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి జేఏఎస్ క్యాంపులు

బల్లికురవ: ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను 20 సచివాలయాల పరిధిలో ఈనెల 30 తేదీ నుంచి అక్టోబర్ 26 వరకు షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సీహెచ్ కృష్ణ సోమవారం తెలిపారు. 30న కొప్పరపాలెం, 3న మల్లాయపాలెం, 4 వేమవరం, 5న ఉప్పుమాగులూరు1, 5న ఉప్పుమాగులూరు 2, 7న చెన్నుపల్లి, 9న కొణిదెన, 10న నక్కబొక్కలపాడు, 11న బల్లికురవ, 12న పెద అంబడిపూడి, 13న ముక్తేశ్వరం, 16న కొమ్మినేనివారి పాలెం, 17న వేమవారిపాలెం 18న కొత్తూరు, 19 కూకట్లపల్లి, 20 కొప్పరపాడు, 21 వైదన, 25 ఎస్ఎల్ గుడిపాడు, 26 వల్లాపల్లి గ్రామాల్లో జరిగే క్యాంపులకు సర్వేలో గుర్తించిన రోగులందరూ సకాలంలో హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

విలేజ్ హెల్త్ క్లినిక్‌తో గ్రామంలోనే వైద్యం


క్లినిక్‌ను ప్రారంభిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

- రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి: విలేజ్ హెల్త్ క్లినిక్‌తో స్వగ్రామంలోనే రోగులకు వైద్యం అంతుందని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. ఆయన సోమవారం మండంలోని జార్లపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల్లోని ప్రజలకు తమ గ్రామాల్లోనే ఆధునిక వైద్యం అందించాలనే ఉద్దేశంతో విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్ ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ క్లినిక్‌లో ఒక సీహెచ్‌వో స్థాయి అధికారి వైద్యం చేస్తారని చెప్పారు. ఈసదవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, స్థానిక నాయకులు, మండల స్థాయి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

భూముల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి


ఎంపీడీవో నేతాజీ, డీటీ సురేష్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న ఏసురత్నం

చీరాల టౌన్: నిరుపేద ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన భూమిని అక్రమంగా ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజావేదిక కార్యదర్శి గుమ్మడి ఏసురత్నం అధికారులను కోరారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన అర్జీల స్వీకరణలో తోటవారిపాలెం దండెకాలనీ, రంగారావుపేటకు చెందిన నిరుపేద ఎస్సీ, ఎస్టీలతో కలిసి తమకు 1971లో ప్రభుత్వం కేటాయించిన భూమిని కొందరు దురాక్రమణ చేశారని, తమకు కేటాయించిన భూములను తమకే చెందేలా అధికారులు కృషి చేయాలని కోరుతూ డిప్యూటీ తహశీల్దార్ సురేష్‌బాబు, ఎంపీడీవో నేతాజీలకు వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా ఏసురత్నం మాట్లాడుతూ 1971లో అప్పటి ప్రభుత్వం 72 మంది గిరిజనులకు సర్వే నంబర్ 801లో సాగు భూమిని కేటాయించిందన్నారు. అలానే 1987లో 59 మంది గిరిజనులకు లే అవుట్ వేసి ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణాలు చేసి ఇచ్చారన్నారు. అయితే గిరిజనులకు కేటాయించిన సాగు భూమిని మాజీ మునుసబు ఆక్రమించి తన ఆధీనంలో ఉంచుకున్నారన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి గిరిజనులకు కేటాయించిన భూములను, ఇళ్ల స్థలాలు వారికే చెందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

గృహ నిర్మాణాలు పూర్తిచేయాలి


పారిశుద్ధ్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రూతమ్మ

వేటపాలెం: జగనన్న లే అవుట్ కాలనీల్లో ఇంకా నిర్మాణాలు పూర్తికాకుండా ఉన్న గృహాల నిర్మాణాలు వేగంగా పర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని హౌసింగ్ డీఈ ఆదేశించారు. స్థానిక మండలం పరిషత్ సమావేశ హాల్లో పంచాయతీ కార్యాదర్శులకు, సచివాలయ కార్యదర్శులకు గృహనిర్మాణాలపై సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. డీఈ మాట్లాడుతూ కాలనీల్లో అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను లబ్ధిదారులచేత త్వరగా పూర్తి చేయించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. వారికి కావాల్సిన రుణాలను మహిళా సంఘాల ద్వారా అందజేయాలన్నారు. ఎంపీడీవో రూతమ్మ మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో ప్రతి రోజు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు. మౌలిక వసతుల కల్పన పూర్తిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ సుబ్బారావు, కార్యాదర్శులు పాల్గొన్నారు.

అవయవదానంతో నలుగురికి ప్రాణం


ర్యాలీ నిర్వహిస్తున్న కళాశాల విద్యార్థులు

ఇంకొల్లు (చినగంజాం): ప్రపంచ ఫార్మసీ దినోత్సవం ఇంకొల్లులో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక డీసీఆర్ఎం ఫార్మసీ కళాశాలలో అవయవదానంపై ఈ సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కళాశాల విద్యార్థులు ర్యాలీలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ వేణు మాట్లాడుతూ అవయవదానం ఎంతో గొప్పదన్నారు. ఆరోగ్యం, అనారోగ్యం ముందు అవయవదానం చేయవచ్చన్నారు. అవయవాల పరిశోధనలకు కూడా ఉపయోగ పడతాయని ఆయన వివరించారు. ప్రజలకు ఉపయోగకరమైన ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన కళాశాల ప్రిన్సిపాల్‌ను డైరక్టర్ సీహెచ్ శ్రీధరరావు అభినందించారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ హెచ్ ప్రదీప్, అధ్యాపక సిబ్బంది, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక నిర్వహణపై అవగాహన అవసరం


సమావేశానికి హాజరైన వీవోఏలు


మాట్లాడుతున్న ఏపీఎం జ్యోతిప్రసాద్

జే.పంగులూరు: ఆర్థిక నిర్వహణపై అవగాహన ఉండాలని ఏపీఎం జ్యోతిప్రసాద్ పేర్కొన్నారు. డ్వాక్రా గ్రూపు సభ్యులు గ్రూపునకు పొదుపు డబ్బులు ఎలా చెల్లిస్తున్నారో.. గ్రూపులు కూడా గ్రామ సంఘానికి పొదుపు డబ్బులు ఏ విధంగా చెల్లించాలో అనే విషయాన్ని ఏపీఎం వీవోలను అడిగారు. పంగులూరులోని వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయంలో ఆర్థిక నిర్వహణపై వీవోఏలకు, వీవో అధ్యక్షులకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ పొదుపు చెలించటంతో పాటు గ్రామ సంఘాలను సొంత నిధులు పెంచుకోవాలని, బ్యాంకు రుణాలు తగ్గించి, పొదుపును, శ్రీనిధి, సీఐఎఫ్, ఉన్నతి మొదలైన వాటిని గ్రూప్ సభ్యులకు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్ అధ్యక్షురాలు, డీపీఎం, సీసీలు, శ్రీనిధి మేనేజర్ పలు గ్రామాల వీవోఏలు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

చీరాల టౌన్: ప్రజలకు ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారంలో రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది అలసత్వం వహించకుండా నిబద్ధతతో పనిచేయాలని తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు సూచించారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలోని సమావేశపు హాలులో రెవెన్యూ ఉద్యోగులతో తహశీల్దార్ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న అర్జీలను త్వరగా విచారణలు చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులు ప్రజలతో సత్సంబంధాలు కలిగి జవాబుదారీగా పనిచేయాలన్నారు. సమావేశంలో డీటీ సురేష్, ఆర్ఐ శేఖర్, సర్వేయర్ చార్లెస్, వీఆర్వోలు ఉన్నారు.

చీరాల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా థామస్


బాధ్యతలు చేపట్టిన జాన్‌థామస్

చీరాల అర్బన్: చీరాల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా కె.జాన్‌థామస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వాడరేవు రోడ్డులోని విద్యుత్‌శాఖ చీరాల డివిజన్ కార్యాలయంలో ఆయన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా బాధ్యతలు చేపట్టారు. విజయవాడ లోడ్ మానిటరింగ్ సెల్ ఈఈగా పనిచేస్తూ బదిలీపై ఆయన చీరాల వచ్చారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఇక్కడ పనిచేసిన సూర్యప్రకాశరావు గుంటూరు విజిలెన్స్ ఈఈగా బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన జాన్ థామస్‌కు ఏడీఈ శ్రీనివాసరావు, ఏఈలు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.